క్లుప్తంగా

14న వాహనాల వేలం

రాజంపేట : ఈనెల 14న రవాణాశాఖ ఆధ్వర్యంలో రాజంపేట ఆర్టీసీ డిపోలో వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా శాఖ అధికారులు తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను రాజంపేట ఆర్టీసీ డిపోలో ఉన్నాయన్నారు. ఈ వాహనాలకు ఈనెల 14న ఉదయం 10 గంటలకు వేలం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైస్‌మిల్లు తనిఖీ

గాలివీడు : మండల కేంద్రం పరిధి చక్కవాండ్లపల్లె రైస్‌మిల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి, వీఆర్వో రవీంద్రారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి తనిఖీల నిమిత్తం రైస్ మిల్ వద్ద వెళ్లగా, నిర్వాహకులు ఎవరూ లేకపోవడంతో మంగళవారం ఉదయం మిల్‌లో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టగా ఎలాంటి అక్రమ నిల్వలు దొరకలేదన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనడం, అమ్మడం నేరమని అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ


కె.రవికుమార్, ఎస్‌ఐ

సంబేపల్లె : సంబేపల్లె మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రవికుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు పెద్దతిమ్మసముంద్రం నుంచి బదిలీపై సంబేపల్లె మండలానికి రావడం జరిగిందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక పనులు ఎవరు చేసినా క్షమించేది లేదన్నారు. నిత్యం ప్రలకు అందుబాటులో వుంటానని తెలిపారు.

వీధిలైట్లకు మరమ్మతులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని విద్యుత్ స్తంభాలకు అమర్చిన వీధిలైట్లు చెడిపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను తెలుకొన్న గ్రామ సర్పంచ్ అంచెల రామచంద్ర మంగళవారం గ్రామంలో చెడిపోయిన వీధి లైట్లకు దగ్గర వుండి మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న దృశ్యం


లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దిన్నెపాడు గ్రామం బెస్తపల్లి దళితవాడలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి మూడు రోజులుగా విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఈ విషయాన్ని దిన్నెపాడు గజేంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన వెంటనే స్పందించి ప్రత్యేక చొరవ తీసుకొని నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి దగ్గర ఉండి బిగించారు. ఈ సందర్భంగా గజేంద్రారెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన స్కూల్ గేమ్స్


పోటీలలో గెలుపొందిన విజేతలతో టీచర్లు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో–ఆర్డినేటర్ గౌరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ కిరణ్ నేతృత్వంలో మంగళవారం బాలబాలికలకు వేర్వేరుగా రన్నింగ్ రేస్, జావెలిన్ త్రో, ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నీటి కోసం నిరసన



సిద్దవటం : తాగునీటి సమస్య పరిష్కారించాలంటూ మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సిద్దవటం మండలంలోని సాయినగర్ గ్రామంలో 20 కుటుంబాలకు గత కొన్ని రోజులుగా తాగునీరు రాక పంట పొలాల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు కొండయ్య మాట్లాడుతూ సోలార్ సిస్టం పనిచేయక నీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని తెలుగుశాఖలో తెలుగు అతిథి ఉపన్యాసకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష తెలిపారు. పిహెచ్‌డి, నెట్, సెట్ అర్హతలతోపాటు బోధనా అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సంబంధిత ధ్రువ పత్రాలతో 9లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

ధరలేక.. దోపిడీని తాళలేక!

ప్రత్యామ్నాయం వైపు మామిడి రైతు

- ప్రతి ఏడాది పెట్టుబడి అధికమవుతున్న గిట్టుబాటు ధర లేక నష్టాలు
- వందల ఎకరాల్లో మామిడి చెట్ల నరికివేత
- రెండేళ్లుగా సరైన ధరలు లేక అప్పుల్లో రైతాంగం
- ఆదుకోవడంలో 'కూటమి' ప్రభుత్వం విఫలమైందంటూ రైతుల మండిపాటు


ఇతర ప్రాంతానికి తరలిస్తున్న మామిడి కలప


గిట్టుబాటు లేకపోవడంతో మామిడి చెట్లను నరికివేసిన రైతులు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని కోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలలో రైతులు 44,122 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మామిడి పంటను పండిస్తున్నారు. ఇక్కడ పండే మామిడికాయలను ఎక్కువగా రాజంపేట, కోడూరు మార్కెట్ యార్డు ద్వారా గుజరాత్, ముంబాయ్, చెన్నై, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు వేల లారీల్లో ఎగుమతి చేస్తూ ఏటా రూ.200 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. కానీ మామిడి రైతులకు గత మూడు సంవత్సరాలుగా లాభాలు రావడం.. అటుంచి నష్టాలు వచ్చాయి. పెట్టుబడులకు అప్పులు ఎక్కువ కావడంతో మామిడిపై నమ్మకం లేక రైతులు మామిడి చెట్లను తొలగించి చెట్లను కలపకు అమ్ముకొంటున్నారు. అలాగే భూమిని చదును చేసి ఇతర పంటల వైపు చూస్తున్నారు. ఇలాగే కొనసాగితే మామిడి పంట ఈ ప్రాంతంలో కనుమరుగయ్యే ప్రమాదముంది.

పెట్టుబడి అధికం.. ధరలు పతనం

మామిడి కాయల కాపు ఆశాజనకంగా ఉన్నా పిందెలు అంతంత మాత్రంగా రావడంతో ఈ ఏడాది ధరలు అధికంగా ఉంటాయని రైతులు ఆశపడ్డారు. దీంతో రైతులు పంటను కాపాడుకోవడానికి మందులు పిచికారీకి అధికంగా వెచ్చించారు. రైతులు సరాసరి ఎకరాకు 50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. కానీ ఈ ఏడాది దళారీల మోసాలతో మామిడి ధరలు తక్కుగా వుండి రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. తోటలో కాయలు కొనుగోలు చేసినప్పుడు ఒక రేటు చెప్పి రైతులు కాయలను యార్డుకు తరలించాక నాణ్యతను సాకుగా చూపి కేజీ కాయలను రూ.4 నుంచి రూ.5లకు కొని నట్టేంట ముంచారు. పలు ప్రాంతాల్లో మామిడి కొనేవారు లేక రైతులు ఏమీ చేయలేక కాయలను తోటల్లోనే వదిలేశారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మామిడి రైతులు నష్టాల పాలైనప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. మామిడి రైతులను ఆదుకుంటామంటూ కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమైందే కానీ తమ ఆదుకోలేదని రైతులు వాపోయారు. కోసిన పంట అమ్ముడుపోక ఉన్న ధరకు విక్రయిస్తే కూలీలకు కూడా గిట్టుబాటు కాదనే భావనతో రైతులు మామిడి కాయలను రోడ్లలో, తోటలలోనే వదిలేసిన సంఘటనలు జరిగాయి. అయిప్పటికీ ప్రభుత్వం, కూటమి నాయకులు మాయమాటలు చెప్పి కాలం వెలిబుచ్చారు. ప్రభుత్వ తీరుతో రైతాంగం నిండా అప్పులలో మునిగిపోయారు. నష్టాలు చూడలేక మామిడి చెట్లను నరికి కలపను ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

మామిడి సాగు అప్పులు మిగిల్చింది



నాకు 8 ఎకరాలు మామిడి తోట ఉంది. 2 సంవత్సరాలుగా ధరలు లేక, కాపు తగ్గి నష్టాలు వచ్చాయి. అప్పులు చేసి మామిడి తోటను సాగు చేయడం కష్టసాధ్యంగా మారింది. తీరా పంట చేతికొచ్చే సమయంలో పెట్టుబడులు రానీ పరిస్థితులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భావించాం. దీంతో అప్పుల్లో కూరుకుపోయాం. నష్టాలు మిగులుస్తున్న మామిడి చెట్లను తొలగించి అరటి, బొప్పాయి సాగు చేస్తున్నాను.

– మల్లు సుధాకర్‌రెడ్డి, రైతు, రైల్వేకోడూరు

ఆలస్యంగా కాపు రావడంతో..



వాతావరణ మార్పుల కారణంగా మామిడి పూత, కాయలు ఆలస్యంగా వచ్చింది. ఈ కారణంతో పంట పెట్టుబడి అధికమైంది. ఆరుగాలం కష్టపడినా సాధారణ కంటే తక్కువ దిగుబడి వచ్చింది. దిగుబడి తక్కువ ఉన్నా ఆశించిన ధర పలకలేదు. ఉన్న ధరకు అమ్ముకుందామన్న గంట తరువాత ఆ ధర కూడా లేక అప్పులు అధికమయ్యాయి. మామిడిపై ఆశలు వదులుకొని ఇప్పుడు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎస్.విశ్వనాథ్‌రెడ్డి, రైతు, ఓబులవారిపల్లి

లాభాలు రావడంలేదు



ఐదు ఎకరాలలో ఉన్న మామిడి పంట గత సంవత్సరం పూత బాగా వచ్చింది. వాతావరణ పరిస్థితుల వల్ల తెగుళ్లకు పూర్తిగా దెబ్బతిన్నాయి. అరకొరగా వచ్చిన మామిడి చేతికందినా ధర పెరిగిందనుకునేలోపు కొనుగోలుదారులు ధరను దారుణంగా తగ్గించారు. రెండు సంవత్సరాలు నష్టాలు వస్తే ఒక్క సంవత్సరం కూడా లాభాలు రావడంలేదు.

– నాగేంద్ర, గండ్లపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం

దళారులతో నష్టపోతున్నాం



మామిడి పంట ఎంత నాణ్యతగా పండించినా చివరకు దళారుల దెబ్బకు అప్పులే మిగులుతున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలి. అలాగే మామిడి వ్యాపారాన్ని చట్టబద్ధత చేసి ప్రభుత్వం ధరలను పర్యవేక్షించాలి. ఇలాగే ఉంటే తోటలను తొలగించి ఇతర పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

– టి.ఈశ్వరయ్య, రాచకుంట, చిట్వేలి మండలం

నేటి నుంచి క్రీడా పోటీలు

గాలివీడు : 2025 – 2026 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 8, 9, 10 తేదీలలో గాలివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ గంగరాజు, ప్రధానోపాధ్యాయులు జాఫర్ తెలిపారు. ఈ పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాలలో అండర్–14, 17 విభాగాల విద్యార్థులు పాల్గొననున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థి పవన్ కుమార్‌ను అభినందిస్తున్న టీచర్లు, సిబ్బంది

వీరబల్లి : మండలంలోని మట్లి గ్రామ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి పెద్దివీటి పవన్ కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపల్ వల్లూరు జయన్న, పీడీ జగదీశ్వరయ్యలు మంగళవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ నెల 4,5,6వ తేదీలలో విశాఖపట్నంలో వాల్తేరు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాణించాడని చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలోనూ పవన్ బాగా ఆడాలని ఆకాంక్షించారు. అలానే విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు పీడీ జగదీశ్వరయ్య తీసుకుంటున్న చొరవ ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్య, విద్యార్థి పవన్ కుమార్‌లను అభినందించారు.

నీరు, విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

పెనగలూరు : మండలంలోని నీరు, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మంగళవారం పెనగలూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు సౌందర్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎక్కడా విద్యుత్, నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా సర్పంచ్‌లు ప్రతి మండల సమావేశానికి హాజరైతే సమస్యలపై చర్చించుకోవచ్చని తెలియజేశారు. అలాగే మండలంలో ఎక్కడైనా సిమెంటు రోడ్లు, మట్టిరోడ్లు అవసరమైతే ఎస్టిమేషన్ వేసి జాబితా అందించాలని ఏఈ గంగులయ్యను ఆయన ఆదేశించారు. హౌసింగ్ ఏఈ శ్రీహరి ప్రసాద్ మాట్లాడుతూ పెనగలూరు జగన్ కాలనీలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా చెట్లు మొలిచి రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. వెంటనే మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి స్పందిస్తూ మండల నిధులతో పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డును చదును చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే లక్ష్మీపురంలో ఏర్పడిన నీటి సమస్యను మండల నిధులతో బోరువేసి నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ముద్రపల్లి సర్పంచ్ శివయ్య నాయుడు బోరు విషయంలో శ్రద్ధచూపి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, తహసీల్దార్ అమరేశ్వరీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తున్న నెట్‌వర్క్ సమస్య

గాలివీడు : మండలంలోని గుర్రంవాండ్లపల్లి, చంద్రాపురం, కమలామర్రి గ్రామాల ప్రజలు గత సంవత్సరం కాలంగా తీవ్ర నెట్‌వర్క్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సంస్థ మూడు టవర్లను ఏర్పాటు చేసినప్పటికీ, అవి సరిగా పనిచేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఎస్ఎన్ఎల్ టెక్నికల్ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టినా, రెండు రోజులకే సేవలు మళ్లీ నిలిచిపోతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం ఈ టవర్లు ఎయిర్–లింక్ మోడ్‌లో మాత్రమే పనిచేస్తున్నందున నెట్‌వర్క్ స్థిరంగా లేకపోవడంతో ప్రజలు నిరంతర కమ్యూనికేషన్ సౌకర్యం కోల్పోతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లు అందుబాటులో లేని ఈ ప్రాంతాల్లో ప్రజలు పూర్తిగా బీఎస్ఎన్ఎల్ సేవలపైనే ఆధారపడుతున్నారు. తరచూ కనెక్టివిటీ అంతరాయాలు ఏర్పడటంతో విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపార వర్గాలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని, టవర్లకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ (ఓఎఫ్సీ) కల్పించాలని గ్రామ ప్రజలు బీఎస్ఎన్ఎల్ అధికారులను కోరుతున్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


రాజంపేట రూరల్: మున్సిపల్ చైర్మన్ పోలాను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు


రాయచోటి టౌన్: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాయచోటి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గువ్వల యోగానంద బాబు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆ మాట మరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాజకీయంగా వాల్మీకులకు ప్రాతినిధ్యం వహించడంలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గువ్వల జగదీష్, వైఎస్సార్ సీపీ సెల్ కార్యదర్శి పరుశురాం, రామయ్య, సాయినాథ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : వాల్మీకిమహర్షి జయంతి వేడుకలను విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ నల్లబోతుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ పాతబస్టాండ్ సమీపంలో ఉన్న వాల్మీకి విగ్రహాన్ని అలంకరించారు. అలానే వాల్మీకి చిత్రపటాన్ని రామ్‌నగర్ నుంచి యువకులు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగిస్తూ వాల్మీకి విగ్రహం వద్దకు తీసుకొచ్చారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి వాల్మీకి నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిలింగ్ మెంబర్‌గా ఎన్నికైనటువంటి పోలా శ్రీనివాసులరెడ్డిని వాల్మీకి నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

ఏయూ అధ్యాపకులకు అవార్డులు

రాజంపేట : ఏయూ అధ్యాపకులకు అరుదైన గౌరవం లభించింది. అక్టోబరు 5న 6వ గ్లోబల్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్స్ అవార్డు పంపిణీ కార్యక్రమంలో యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన డాక్టర్ ఎం.పద్మలలిత, ఏ. సునీల్, డాక్టర్ బి. నాగముని, ఎస్.పార్థసారధి, డాక్టర్ డి.జె. సమతా నాయుడులు ఉత్తమ సేవా పురస్కారాలను ట్రిపుల్ ఐటీ ఇడులపాయ డైరెక్టరు డా.ఏవీఎస్ కుమారస్వామి గుప్తా చేతులమీదుగా అందుకున్నట్లు ఏయూ చైర్మన్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం యూనివర్సిటీ ప్రాంగణంలో అవార్డు గ్రహీతలను ఆయన ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఇ.సాయిబాబా రెడ్డి, వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ పాల్గొన్నారు.


అవార్డులందుకున్న వారితో చొప్పా గంగిరెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు

ప్రభుత్వ హైస్కూల్ ఎడ్యుకేషన్ హబ్‌లాంటిది

ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ ఛాన్స్‌లర్ మురళీ


మాట్లాడుతున్న రిటైర్డ్ వైస్ ఛాన్స్‌లర్ మురళీ

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ ఎడ్యుకేషన్ హబ్‌లాంటిదని ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ పోలూరు మురళీ తెలిపారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ రమణరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మురళీ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న ప్రభుత్వ హైస్కూల్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరపాలన్న ఆలోచన తనకు కొన్ని నెలల క్రితం వచ్చిందన్నారు. పూర్వ విద్యార్థిగా తన ఆలోచనను తొలుత హైస్కూల్ పూర్వ విద్యార్థులైన రిటైర్డ్ ప్రిన్సిపల్ నెట్టెం శ్రీరాములునాయుడు, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, డాక్టర్ సి.సుధాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ రమణరాజుతో పంచుకున్నట్లు తెలిపారు. తొమ్మిది దశాబ్దాల క్రితం చెంగయ్యనాయుడు కృషి ఫలితంగా రాజంపేటకు ప్రభుత్వ హైస్కూల్ మంజూరైందని ఆ తర్వాత కాలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు కూడా మంజూరై హైస్కూల్ ప్రాంగణంలోనే కొనసాగడం ప్రతి ఏటా వేలాది మంది ఇక్కడ చదువుకుంటుండటం వల్ల ప్రభుత్వ హైస్కూల్ ఓ ఎడ్యుకేషన్ హబ్‌లా రూపాంతరం చెందిందన్నారు. పూర్వ విద్యార్థి రిటైర్డ్ ప్రిన్సిపల్ శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ ఓ కమిటీ వేసి శతాబ్ది ఆవిర్భావ దినోత్సవం వరకు ప్రతి ఏడాది ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుదామని, అలాగే శతాబ్ది ఉత్సవాలను నభూతో నభవిష్యత్తు అనేలా జరపాల్సిన బాధ్యతను ప్రతి పూర్వ విద్యార్థి తీసుకోవాలని కోరారు. రిటైర్డ్ ఇంజనీర్ ఏబీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల స్థల సేకరణ కింద ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానానికి సంబంధించిన ఎకరాన్నర స్థలం ప్రభుత్వం తీసుకుందని, అందువల్ల ప్రభుత్వం ప్రభుత్వ హైస్కూల్‌కు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఆ నష్టపరిహాన్ని మంజూరు చేయించుకుంటే ప్రభుత్వ హైస్కూల్ అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చని తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు మాట్లాడుతూ ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన భవనాల పునాదులు ఎంతో పటిష్టంగా ఉన్నాయని, అయితే వర్షాకాలంలో ఉరుస్తున్నందున మరమ్మత్తులు చేయించాల్సివుందన్నారు. అందుకు దాదాపు 30 లక్షలు అవుతుందని తనవంతు లక్ష రూపాయిలు ఇస్తానని, దాతలు ముందుకు వస్తే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మరమ్మత్తులు చేసుకోవచ్చన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమ్మర్తి జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ భవనాలకు మరమ్మత్తులు చేపట్టేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేసిన దాతల వారసులను ఘనంగా సత్కరించారు. తొలుత రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ పోలూరు మురళీ జ్యోతిప్రజ్వలన చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఇదిలావుంటే ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థిని శ్రీలత తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, స్నేహితుల పేర్లను ఉచ్చరిస్తూ ఆలపించిన గేయం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు డాక్టర్ పోరా సుబ్బానాయుడు, పుల్లంపేట ఎంఈఓ జి.చక్రధర్‌రాజు, ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం నాగమణి, రిటైర్డ్ ప్రిన్సిపల్ నరసింహనాయుడు, రిటైర్డ్ హెచ్‌ఎం ఎ.శంకర్‌రాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం


వైఎస్సార్ కాలనీలో దెబ్బతిన్న రోడ్డును జేసీబీతో చదును చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో చేపట్టిన పైపులైన్ పనుల అవకతవకలపై 'సాక్షి'లో 'పైప్‌లైన్ పనుల్లో పచ్చ పైత్యం' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం వైఎస్సార్ ఎస్సీ కాలనీలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించి పైప్‌లైన్ కోసం తీసిన గుంతలను జేసీబీ సాయంతో పూడ్చి చదును చేశారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు. త్వరలోనే కాలనీలోని అన్ని వీధులకు కుళాయిలను ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కుమార్ హామీఇచ్చారు. అధికారి హామీపై ఎస్సీ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

అందుబాటులో చీనీ, నిమ్మ మొక్కలు


నర్సరీలో అందుబాటులో ఉన్న మొక్కలు

రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ నర్సరీలో నాణ్యమైన చీనీ, నిమ్మ మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యానశాఖ అధికారి లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో చీనీ, నిమ్మతోటలో చీడపీడలు ఉధృతంగా పెరగడం వల్ల పంటలు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందని, దీనిని అధికమించడానికి రైతులకు నాణ్యమైన మొక్కలను ప్రభుత్వ నర్సరీ నుంచి రైతులు కొనుగోలు చేయాలన్నారు. నర్సరీలో చీనీ మొక్క రూ. 55లు, నిమ్మ మొక్క రూ. 25లకు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సుండుపల్లె : రైతులందరూ వరి పొలాలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణరాజు తెలిపారు. మండల పరిధిలోని మడితాడు, బెస్తపల్లి, వైఎస్ పాలెం గ్రామాలలో వరి పొలాలను శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరి పంటలో ముఖ్యంగా అగ్గి తెగులు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించామన్నారు. నివారణకు కాలిబాటలు వరి పొలాలలో తీయాలని, సూచించిన మేరకే పురుగు మందులను వాడాలని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సబ్సిడీ పరికరాలను పొందేందుకు రైతు సేవా కేంద్రాలను సందర్శించి దరఖాస్తులను అందించాలన్నారు. అధికంగా ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా, ఆర్ఎస్‌కే సిబ్బంది, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మహాలక్ష్మి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు ప్రతి విద్యార్థి అటెండెన్స్ కచ్చితంగా తీసుకోవాలన్నారు. వాష్‌రూంలు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

జిల్లా జట్టుకు ఎంపిక

పుల్లంపేట : కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ సాయిరాం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం మైదుకూరులో జరిగిన అండర్ – 19 విభాగంలో పదో తరగతి విద్యార్థిని హారిక ఉమ్మడి కడప జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.